

# ముందుమాట

కొత్త తరం కోసం కొత్త రాజకీయాన్ని ప్రతిష్ఠించటం లక్ష్యంగా లోక్‌సత్తా పార్టీ పుట్టింది. అధికారాన్ని లక్ష్యంగా కాక అందరికి అవకాశాల నందించే మార్గంగా లోక్‌సత్తా భావిస్తున్నది. అందుకే ప్రజలలో బీదరికాన్ని, అమాయకత్వాన్ని, అసహాయతని ఆసరాగా చేసుకుని ఓట్లు నోట్లతో కొనటం, మద్యం మత్తులో ముంచటం, విభేదాలని రెచ్చగొట్టటం, తాత్కాలిక తాయిలాలతో తృప్తి పరచటం, రాజకీయాన్ని వ్యాపారంగా నడపటం, అధికారాన్ని సొంత ఆస్తిగా మార్చుకుని అడుగడుగునా అవినీతికి పాల్పడటం, కుటుంబ రాజకీయం – వీటన్నింటినీ లోక్‌సత్తా నిర్ద్వంద్వంగా వ్యతిరేకిస్తోంది. అంతర్గత ప్రజాస్వామ్యం, పారదర్శకంగా నిధుల సేకరణ ఇంకా వినియోగం, హేతుబద్ధమైన విధానాలు, ప్రజాభిప్రాయ సేకరణలో అందరి స్వేచ్ఛని పెంచే రాజ్యాంగబద్ధ పద్ధతులు – వీటికి లోక్‌సత్తా పూర్తిగా కట్టుబడి ఉంది.

ప్రతి రాజకీయ పార్టీ సమాజ పరిస్థితులని విశ్లేషించి, జాతికి నిర్దిష్ట లక్ష్యాలని ప్రతిపాదించాలి. పుట్టుకతో వివక్ష లేకుండా ప్రతి బిడ్డకి విద్య, ఆరోగ్యం, నైపుణ్యం, ఉపాధి అందటం; వ్యవసాయం, సంప్రదాయ వృత్తులలో ఆదాయాన్ని పెంచి లాభసాటిగా మార్చటం; గ్రామాలలో, పట్టణాలలో మౌలిక సదుపాయాలనందించి జీవన ప్రమాణాలని పెంచటం; అధికారాన్ని పూర్తిగా వికేంద్రీకరించి జిల్లా, స్థానిక ప్రభుత్వాలని ప్రతిష్ఠించటం; పాలనలో పూర్తి పారదర్శకతని, జవాబుదారితనాన్ని తేవటం; అందరికీ ఒకే న్యాయాన్నందించి చట్టబద్ధ పాలనని సార్థకం చేయటం; నిజమైన సామాజిక న్యాయాన్ని సాధించి పుట్టిన కులం, మతం, కుటుంబం పౌరుడి భవిష్యత్తుని శాసించకుండా నూతన సమాజాన్ని నిర్మించటం; అవినీతిని అంతమొందించి ప్రజాధనాన్ని పూర్తిగా సద్వినియోగం చేయటం లోక్‌సత్తా లక్ష్యాలు.

ఈ లక్ష్యాలని నెరవేర్చటం కోసం నిర్దిష్టమయిన పథకాలని, కార్యక్రమాలని అమలుచేయటం లోక్‌సత్తా ప్రభుత్వ కర్తవ్యం; వాటిని రూపొందించి బహిరంగ చర్చ ద్వారా జనాభిప్రాయాన్ని కూడగట్టటం లోక్‌సత్తా పార్టీ కర్తవ్యం. ప్రజలని కేవలం ఓటు బ్యాంకులుగా, చేయిచాచి అర్థించే యాచకులుగా సంప్రదాయ రాజకీయం పరిగణిస్తోంది. అందుకే ప్రజల పన్నుల డబ్బులో సింహభాగాన్ని దోచుకుని, వృథాగా ఖర్చుచేసి, కొద్ది భాగాన్ని మళ్ళీ ఆ ప్రజలకే

దానమిచ్చినట్లు నటించి పబ్బం గడుపుకోవటం, ప్రభువులైన పౌరుల్ని నిరంతరం ప్రభుత్వంపై ఆధారపడే దీనస్థితికి దిగజార్చటం ఈ సంప్రదాయ రాజకీయంలో కీలక వ్యూహాలు. అలాకాక పౌరులలోని శక్తి, సామర్థ్యాలని వెలికి తీసి, సంపద సృష్టిలో ప్రజలని భాగస్వాములని చేసి, ప్రతి వ్యక్తికి ఆత్మగౌరవాన్ని, హుందాతనాన్ని, జీవితంలో భద్రతని, ఎదిగే అవకాశాన్ని అందించటం లోక్‌సత్తా లక్ష్యం.

అందుకే లోక్‌సత్తా పూర్తిగా కట్టుబడే నిర్దిష్టమయిన గ్యారంటీలని ప్రజల ముందు పెడుతున్నాము. ప్రజలకిచ్చే విస్పష్టమయిన, తిరుగులేని ఈ హామీలని తు.చ. తప్పకుండ నెరవేర్చటం లోక్‌సత్తా ప్రభుత్వానికి మౌలిక కర్తవ్యమవుతుంది. ప్రతి గ్యారంటీలో లోతైన ఆలోచన, దీర్ఘకాల లక్ష్యాల పట్ల నిబద్ధత, ప్రజలని ప్రభువులగా భావించే తత్వం ఇమిడి ఉన్నాయి. ఈ గ్యారంటీల రూపకల్పనలో ఈ క్రింది మౌలిక ప్రమాణాలని పాటించటం జరిగింది.

★ ప్రతి పౌరుడికి వివక్ష లేకుండా ఎదిగే అవకాశాలు అందటం.

★ పాలనని, రాజకీయాన్ని ప్రజల జీవితాల చుట్టూ తిప్పటం.

★ ప్రజలని ప్రభువులని చేయటం.

★ పౌరుడిని తన కాళ్ళమీద తాను నిలబడేలా తీర్చిదిద్దటం.

★ జాతి దీర్ఘకాల లక్ష్యాలని సాధించటం.

★ అన్ని వర్గాల ప్రయోజనాలని సమన్వయం చేసి అందరికీ న్యాయం చేయటం.

★ గతానుభవం ఆధారంగా అతి తక్కువ వనరులతో అత్యుత్తమ ఫలితాలు సాధించటం.

★ హేతుబద్ధమయిన, సృజనాత్మకమయిన, ఆచరణత్మకమయిన విధానాలని రూపొందించటం.

ఇందులో ప్రతి గ్యారంటీకి లోక్‌సత్తా పూర్తిగా కట్టుబడి ఉంది. "లోక్‌సత్తా ప్రభుత్వం నుంచి ఏం ఆశించవచ్చు?" అనే సహజమయిన ప్రశ్నకి ఈ గ్యారంటీలు నిర్దిష్టమయిన, తిరుగులేని సమాధానం. రాష్ట్రమంతటా ప్రతి కుటుంబాన్ని, ప్రతిపౌరుడిని చైతన్యవంతుల్ని చేయటం, నిశ్శబ్ద విప్లవాన్ని తెచ్చి లోక్‌సత్తా ప్రతిపాదిస్తున్న నూతన సమాజాన్ని సాధించటం మనసున్న ప్రతి పౌరుడి కర్తవ్యం.



జూలై : 2008 **జయప్రకాష్ నారాయణ్**

హైదరాబాదు. అధ్యక్షులు, లోక్‌సత్తా పార్టీ

# విషయసూచిక


| | పేజి |
|---|---|
| 'ఇంటి ముందు ప్రభుత్వం - కంటి ముందు పాలన' | 7 |
| ప్రతి జిల్లాకి ఒక ప్రభుత్వం | 8 |
| సుఖజీవనానికి 'గ్రామ స్వరాజ్యం' | 13 |
| నగరాలలో సురాజ్యం | 21 |
| రాష్ట్రంలో 1000 చిన్న పట్టణాలు | 27 |
| విద్యతో అందరికీ ఎదిగే అవకాశం | 31 |
| యువతకు నైపుణ్యం, ఉపాధి | 39 |
| అందరికీ ఉచితంగా వైద్య సేవలు | 45 |
| లోక్‌సత్తా పార్టీ వ్యవ 'సాయం' | 51 |
| కఠిన మద్య నియంత్రణ | 59 |
| సమన్యాయం, సత్వర న్యాయం | 65 |
| స్వాహారాజ్యం అంతం కోసం... | 69 |

సాంఘిక న్యాయం 73

అందరికీ సామాజిక భద్రత 74

కుల నిర్మూలన 77

శాసన సభ పనితీరులో మౌలిక సంస్కరణలు 81

ప్రాంతీయ అసమానతలను రూపుమాపడం 87

అర్హులందరికీ ఓటు హక్కు 91

భూ-రికార్డులు, స్టాంప్‌డ్యూటీ 95

ఇంటి ముందు ప్రభుత్వం -
కంటి ముందు పాలన

# ' ఇంటి ముందు ప్రభుత్వం - కంటి ముందు పాలన '

# ప్రతి జిల్లాకి ఒక ప్రభుత్వం

మన రాష్ట్రంలో చాలా జిల్లాలు ప్రపంచంలో 100 దేశాల కంటే పెద్దవి. అలాంటిది మన గ్రామాలలో, పట్టణాలలో, జిల్లాలలో ఏ చిన్న పని కావాలన్నా హైదరాబాదు చుట్టూ, ఢిల్లీ చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తోంది. అలాంటప్పుడు మన స్వాతంత్ర్యం, స్వపరి పాలన కాగితాలకే పరిమితమవుతున్నాయి. ఓటు వేసే ప్రజల్ని ప్రభువులు గాను, పన్నుకట్టి ప్రభుత్వాలని పోషించే పౌరుల్ని ప్రభుత్వంలో వాటాదారులుగాను లోక్‌సత్తా పార్టీ ప్రభుత్వం గుర్తిస్తుంది. ప్రతి జిల్లాకి సర్వాధికారాలతో జిల్లా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుంది. ప్రతి స్థానిక ప్రభుత్వానికి పూర్తి బాధ్యతలని, అధికారాల్ని ఇచ్చి తగిన వనరులని కేటాయిస్తుంది. పౌరులు కేంద్రంగా స్థానిక ప్రభుత్వాలు పనిచేస్తాయి. ప్రజలిచ్చిన అధికారాన్ని ఆ ప్రజలకే జవాబుదారి తనంతో సేవలు అందేలా పాలనలో మౌలిక విప్లవాన్ని తెస్తుంది.

सत्यमेव जयते

# 1 జిల్లా ప్రభుత్వాల ఏర్పాటు

- **చట్టం ద్వారా ప్రత్యక్షంగా ఎన్నికైన జిల్లా ప్రభుత్వాల ఏర్పాటును లోక్‌సత్తా ప్రభుత్వం గ్యారంటీ చేస్తుంది.**
- జిల్లా ప్రధాని, ఆ జిల్లా మంత్రివర్గానికి అధ్యక్షులుగా ఉంటారు.
- కలెక్టరు జిల్లా ప్రభుత్వానికి కార్యదర్శిగా పనిచేస్తారు.
- పాఠశాల విద్య, ఆరోగ్యం, వ్యవసాయం, పశుపోషణ, గ్రామాలలో, పట్టణాలలో మౌలిక సదుపాయాలు, ఉపాధికల్పన, బీదలకి సామాజిక భద్రత, పౌరసరఫరాలు, సాంఘిక సంక్షేమం, తదితర స్థానిక ప్రభుత్వాల అంశాలన్నింటికి జిల్లామంత్రులు పూర్తిబాధ్యత వహిస్తారు. వాటి నిర్వహణకి కావలసిన వనరులని లోక్‌సత్తా ప్రభుత్వం జిల్లా ప్రభుత్వాలకు నేరుగా బదిలీ చేస్తుంది.

# 2 స్థానిక ప్రభుత్వాలదే నిర్ణయాధికారం

★ **జిల్లా ప్రభుత్వాలు, పంచాయితీలు, మున్సిపాలిటీలు తమ పరిధిలోని అంశాలపై నిర్ణయాలు తీసుకుని అమలుపరిచే స్వేచ్ఛను లోక్‌సత్తా ప్రభుత్వం గ్యారంటీ చేస్తుంది.**

★ జిల్లా ప్రభుత్వాలు, పంచాయితీలు, మున్సిపాలిటీలు తమ పరిధిలో స్థానిక ప్రభుత్వాలుగా వ్యవహరించడానికి తగిన కొత్త చట్టాలు తెస్తుంది.

★ రక్షిత మంచినీరు, పారిశుద్ధ్యం, డ్రైనేజి, రోడ్లు, గృహవసతి, ఇతర మౌలిక సదుపాయాలు, వివిధ పథకాల అమలు, ధృవపత్రాల జారీ ఇలాంటి సేవలన్నింటిని స్థానిక ప్రభుత్వాలే అందిస్తాయి. ఇందుకు అవసరమయిన నిధులు, సిబ్బంది పూర్తిగా స్థానిక ప్రభుత్వాల అధీనంలోనే ఉంటాయి.

# 3 జిల్లాలకి పుష్కలంగా నిధులు

★ **రాష్ట్రబడ్జెట్‌లో జిల్లాల వారీ కేటాయింపుల ద్వారా రాష్ట్ర ప్రణాళికా వ్యయంలో 50 శాతం జిల్లా ప్రభుత్వాలకి లోక్‌సత్తా ప్రభుత్వం గ్యారంటీ చేస్తుంది.**

★ జిల్లా ప్రభుత్వాల అధీనంలో ఉన్న అన్ని రంగాల నిధులు స్థానిక ప్రభుత్వాలకి బదిలీ అవుతాయి.

★ ప్రతి పంచాయతీకి, పట్టణానికి జనాభాని బట్టి తలసరి 1000 రూపాయల నిధులని లోక్‌సత్తా ప్రభుత్వం అదనంగా ఏటా కేటాయిస్తుంది. అంటే వెయ్యి జనాభా ఉన్న గ్రామానికి రూ॥ 10 లక్షలు, 10,000 జనాభా ఉన్న గ్రామానికి 1 కోటి, లక్ష జనాభా ఉన్న పట్టణానికి రూ॥ 10 కోట్లు ఏటా అదనంగా నిధులు అందుతాయి.



# 4 పాలనలో ప్రజల ప్రత్యక్ష భాగస్వామ్యం

★ **స్థానిక ప్రభుత్వాల కార్యకలాపాల నిర్వహణలో ప్రజల ప్రత్యక్ష భాగస్వామ్యాన్ని లోక్‌సత్తా ప్రభుత్వం గ్యారంటీ చేస్తుంది.**

★ విద్య, ఆరోగ్యం, పౌరసరఫరాలు, నీటి పారుదల, మార్కెట్లు లాంటి కీలకరంగాలలో ప్రజలే ఎన్నుకున్న సభ్యులు, స్థానిక ప్రభుత్వాల ప్రతినిధులు, నిపుణులతో చట్టబద్ధంగా ప్రజా కమిటీలని ఏర్పాటు చేసి, నిర్వహణ బాధ్యతని వారికి అప్పగిస్తుంది.

★ పట్టణాలలో, నగరాలలో ప్రతి వార్డుకి స్థానిక పోలింగ్‌స్టేషన్ నుండి ఎన్నికయిన ప్రతినిధులతో వార్డు ప్రభుత్వాలను ఏర్పాటు చేస్తుంది.

★ ప్రతి పంచాయతీకి అధ్యక్షుడిని, పట్టణానికి, నగరానికి మేయరుని, జిల్లా ప్రభుత్వానికి ప్రధానిని ప్రజలే ప్రత్యక్షంగా ఎన్నుకుంటారు.

★ చట్టాలు, నిబంధనలు, ఆదేశాలు, ఫైళ్ళు, అన్ని పాలనా వ్యవహారాలు తెలుగులో విధిగా జరిగే ఏర్పాట్లుంటాయి.

సుఖజీవనానికి ‘ గ్రామస్వరాజ్యం ’

# సుఖజీవనానికి
# ‘ గ్రామ స్వరాజ్యం ’

## సుఖజీవనానికి
## ' గ్రామ స్వరాజ్యం '

70 శాతం జనాభా వున్న మన గ్రామాలు నేటికీ వెలవెల పోతున్నాయి. పల్లె ప్రజలకి మౌలిక సదుపాయాలు అందక, కనీస అవసరాలు తీరక వారి బ్రతుకు దుర్భరంగా వుంటున్నది. ప్రభుత్వ పథకాలు చాలా మేరకు దళారులకు, లంచగొండులకి అందుతున్నాయి; అవినీతి లేకుండా ప్రజలకు పావలా వంతు కూడా దక్కడం లేదు. గ్రామాలలో అందరికీ కనీస సౌకర్యాలు, వసతుల కోసం లోక్‌సత్తా ప్రభుత్వం నిర్దిష్ట చర్యలను తీసుకుంటుంది. గ్రామాలను సౌభాగ్యవంతంగా తీర్చిదిద్దుతుంది.

# 5 గ్రామాలకు పుష్కలంగా నిధులు

- ★ **ప్రతి పంచాయతీకి ఇతర నిధులతో పాటు అదనంగా రూ॥ 1000/- ఏటా తలసరి గ్రాంటును లోక్‌సత్తా ప్రభుత్వం గ్యారంటీ చేస్తుంది.**
- ★ అంటే 1000 జనాభా వున్న గ్రామానికి ప్రభుత్వ పథకాలకు అందే నిధులతో పాటు ఏటా అదనంగా రూ॥ 10 లక్షల నిధులు.
- ★ 10,000 జనాభా వున్న గ్రామానికి ఏటా కోటి రూపాయలు అదనపు నిధులు.
- ★ ఈ నిధులతో గ్రామాల రూపురేఖల్ని మార్చటానికి, ప్రజల సుఖజీవనానికి చర్యలు తీసుకునే సత్తాను స్థానిక ప్రభుత్వాలకు కల్పిస్తుంది.



# 6 గ్రామాలకి తాగునీరు

- ★ **ప్రతి గ్రామానికి ట్రీట్‌మెంటు ప్లాంటుల ద్వారా శుద్ధి చేసిన తాగునీటిని అందరికీ అందించడం లోక్‌సత్తా ప్రభుత్వం గ్యారంటీ చేస్తుంది.**
- ★ ఫిల్టరేషన్, సూక్ష్మక్రిములని చంపే రసాయనాల ట్రీట్‌మెంట్ జరిగే ఏర్పాట్లుంటాయి.
- ★ వారం, వారం నీటిని పరీక్ష చేసి, మంచి ప్రమాణాలు కాపాడే నిఘా వుంటుంది.
- ★ పంచాయతీకి అవసరమైన నిధులు అందిస్తుంది. అయినప్పటికీ బాధ్యత నిర్వహణలో విఫలమైతే పంచాయతీ పై రద్దుతో సహా కఠిన చర్యలు తీసుకుంటుంది.





## 7 నీటి సమస్యలకి 'జలరక్ష'

- **భూగర్భ కాలుష్యం, నీటిలో అధికంగా ఫ్లోరైడు, ఉప్పునీరు, చెరువుల మీదనే ఆధారపడటం - ఇటువంటి సమస్యలున్న ప్రతి గ్రామంలో విధిగా రివర్స్ ఆస్మాసిస్/డి-మినరలైజేషన్ ప్లాంట్లను ఏర్పాటు చేసి అత్యున్నత ప్రమాణాలతో స్వచ్ఛమైన త్రాగునీటిని అందరికి లోక్‌సత్తా ప్రభుత్వం గ్యారంటీ చేస్తుంది.**
- పంచాయతీ పర్యవేక్షణలో, మంచినీటి వ్యవస్థ నిర్వహణలో స్థానిక యువతకి బాధ్యతని కల్పించి, శిక్షణ ఇప్పించి ఉపాధిని కల్పిస్తుంది.
- మారుమూల గ్రామాలలో కూడా ఆరోగ్యాన్ని రక్షించే మంచినీటి సరఫరా హామీని ఇస్తుంది.



# 8 'గ్రామదీపం'

★ **ప్రతి గ్రామంలో *24 గంటల పాటు,* సంవత్సరం పొడవునా గృహ విద్యుత్ సరఫరాను లోక్‌సత్తా ప్రభుత్వం గ్యారంటీ చేస్తుంది.**

★ వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్‌లని వేరు చేసి, ఓల్టేజి హెచ్చుతగ్గులు లేని నాణ్యమైన విద్యుత్‌ను గ్రామాలకు అందిస్తుంది.

★ ఓల్టేజీ లోపం వల్ల మోటార్లు కాలితే ప్రభుత్వం నుండి రైతులకి పరిహారం అందిస్తుంది.

★ విద్యుత్ పంపిణీ నిర్వహణ బాధ్యతను స్థానిక ప్రభుత్వాలకి, ప్రజలకి అప్పగిస్తుంది.

# 9 బహిరంగ మలవిసర్జన నిషేధం

- **ప్రతి ఇంటికి సెప్టిక్‌ట్యాంక్ మరుగుదొడ్డిని లోక్‌సత్తా ప్రభుత్వం గ్యారంటీ చేస్తుంది.**
- మహిళలకి, పిల్లలకి, వృద్ధులకి హుందాతనంతో పాటు అందరికీ ఆరోగ్య సౌకర్యం కలిగిస్తుంది.
- బహిరంగ మలవిసర్జనను నిషేధిస్తుంది.
- ప్రభుత్వ నిధులతో అందరికీ మరుగుదొడ్లను కల్పించడం, బహిరంగ మలవిసర్జన నిషేధాన్ని అమలుచేసే అధికారం పంచాయితీకి అప్పగిస్తుంది.
- దీనిని విస్మరించిన పంచాయితీలపై రద్దుతో సహా ఇతర కఠినమైన చర్యలను లోక్‌సత్తా ప్రభుత్వం తీసుకుంటుంది.



# 10 గ్రామ రహదారి

★ **ప్రతి గ్రామాన్ని దగ్గర పట్టణంతో కలుపుతూ అన్ని కాలాలలో ప్రయాణానికి అనువైన తారురోడ్డును గ్యారంటీ చేస్తుంది.**

★ రోడ్డు నిర్వహణకి తగిన నిధులు, బాధ్యతలు గ్రామ పంచాయతీలకు అప్పగిస్తుంది.

# 11 ప్రతి గ్రామానికి బస్సు

★ **ప్రతి గ్రామానికి విధిగా బస్సు సౌకర్యాన్ని గ్యారంటీ చేస్తుంది.**

★ రోజూ కనీసం నాలుగు ట్రిప్పులు – అవసరాన్ని బట్టి మరిన్ని ట్రిప్పులు ఏర్పాటు చేస్తుంది.

★ విద్యార్థులకి, హస్పిటల్‌కి వెళ్ళే రోగులకి ఉచిత రవాణా సౌకర్యం కల్పిస్తుంది.

★ వ్యవసాయ ఉత్పత్తుల రవాణాకు తగిన సదుపాయాలు కల్పిస్తుంది.

★ గ్రామాలలో రవాణా సౌకర్యం కోసం సంస్థకి తగిన సబ్సిడీ అందిస్తుంది.

నగరాలలో సురాజ్యం

# నగరాలలో సురాజ్యం



# నగరాలలో సురాజ్యం

మన నగరాలలో, పట్టణాలలోని మంచినీరు, పారిశుద్ధ్యం, రోడ్లు వంటి మౌలిక వసతులు, ఇతర పౌర సేవలు అధ్వాన్నంగా వున్నాయి. పౌర రవాణా – ట్రాఫిక్ సమస్యలు, భూకబ్జాలు – సెటిల్‌మెంట్లు– అక్రమ కట్టడాలు, చోరీలు – దోపిడీలు, గడపదాటితే యాక్సిడెంట్లు – కిడ్నాపులు, అన్నీ కలిసి నరకాన్ని తలపిస్తున్నాయి. నగరవాసులని తీవ్ర వత్తిడికి, బాధకు గురి చేస్తున్నాయి.

అందుకే నగరాలలో సురాజ్య స్థాపనకు లోక్‌సత్తా పార్టీ పూనుకుంది.

# 12 పట్టణాలు, నగరాలలో మౌలిక వసతులు

★ **పట్టణాలు, నగరాలలో సుఖజీవనం కోసం:**

- **శుద్ధి చేసిన మంచినీరు సరఫరా : ప్రయివేటు వాటర్‌బాటిల్స్ అవసరం లేకుండా**
- **చింత లేని పౌర రవాణా : స్వంతవాహనం అవసరం కాకుండా**
- **మెరుగైన పారిశుద్ధ్యం : చెత్తకుప్పలు, మురుగునీరు, అనారోగ్యహేతువు కాకుండా**
- **స్థానిక సేవలకు వార్డు ప్రభుత్వాలు : ప్రతి చిన్న పనికీ ఆఫీసుల చుట్టూ తిరగకుండా**
- **పౌర సేవలకు సిటిజన్స్ ఛార్టర్లు : అవినీతికి పైసా ఖర్చు కాకుండా**

**లోక్‌సత్తా ప్రభుత్వం ప్రజలకు గ్యారంటీ చేస్తుంది.**

★ ఇందుకోసం ప్రతి పట్టణానికి, నగరానికి జనాభాని బట్టి తలసరి 1000 రూపాయల నిధులని లోక్‌సత్తా ప్రభుత్వం అదనంగా ఏటా కేటాయిస్తుంది. అంటే లక్ష జనాభా ఉన్న పట్టణానికి రూ॥ 10 కోట్లు, 10 లక్షల జనాభా వున్న నగరానికి రూ॥ 100 కోట్లు ఏటా అదనంగా నిధులను ఇస్తుంది.

# 13 ప్రతి వార్డుకీ స్థానిక ప్రభుత్వం

★ **ప్రజల స్థానిక అవసరాలను తక్షణమే తీర్చడానికి ప్రజల ప్రత్యక్ష భాగస్వామ్యంతో ప్రతి వార్డుకీ ఒక స్థానిక ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి, సాలీనా తలసరి రూ॥ 500/- నిధులని లోక్‌సత్తా ప్రభుత్వం గ్యారంటీ చేస్తుంది.**

★ నగరాలలో పేదల వాడలలో మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక నిధులు, ఏర్పాట్లు లోక్‌సత్తా ప్రభుత్వం చేపడుతుంది.

★ వార్డు ప్రభుత్వాల ద్వారా ప్రజల ప్రత్యక్ష భాగస్వామ్యంతో కాలనీలలో మంచినీరు, రోడ్లు, డ్రైనేజి, వీధి దీపాలు, పారిశుద్ధ్యం, పార్కుల నిర్వహణను మెరుగుపరుస్తుంది.

★ ప్రతి నగరంలో, పట్టణంలో కనీస వసతులకి హామీనిస్తూ పౌర హక్కుల పత్రాలని అమలు చేస్తుంది. ఆలస్యానికి పరిహారాన్ని చెల్లిస్తుంది.

★ ప్రతి నగరంలో, పట్టణంలో నిరంతరం అందుబాటులో వుండే కాల్‌సెంటర్‌ని ఏర్పాటు చేసి, ఫిర్యాదులని, సమస్యలని నిర్ణీత కాలంలో పరిష్కరిస్తుంది.

14

# నగరాలలో మెరుగైన పౌర రవాణా

★ **ప్రతి నగరంలో, పట్టణంలో ప్రజలు పూర్తిగా ఆధారపడదగిన పౌర రవాణా (పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్) వ్యవస్థ ఏర్పాటును లోక్‌సత్తా ప్రభుత్వం గ్యారంటీ చేస్తుంది.**

★ నగరాలలో ఇప్పుడున్న రోడ్డు రవాణా వ్యవస్థను లోక్‌సత్తా ప్రభుత్వం విస్తరించి, మెరుగుపరుస్తుంది.

★ సొంత వాహనాలపై పెరుగుతున్న ఇంధన ఖర్చు భారాన్ని నగరవాసుల మీద తగ్గేందుకు మెరుగైన ప్రత్యామ్నాయంగా పౌర రవాణా వ్యవస్థను రూపొందిస్తుంది.

★ నగరాలలో ట్రాఫిక్ జామ్‌ల నుండి విముక్తి కోసం యుద్ధ ప్రాతిపదికన ఫ్లై-ఓవర్‌లు, రింగ్‌రోడ్డులు, బైపాస్ రోడ్లను నిర్మిస్తుంది.



# 15 భద్రతకి 'భరోసా'

★ నగరాలలోని చోరీలు, భూకబ్జాలు, దోపిడీలు, కిడ్నాపింగ్‌లను సత్వరమే అరికట్టడానికి కట్టుదిట్టమైన రక్షణ ఏర్పాట్లు చేసి ప్రజలకు, వారి పిల్లలకు పూర్తి భద్రతని లోక్‌సత్తా ప్రభుత్వం భరోసా ఇస్తుంది.

★ **అందరికి భద్రతని కల్పించడానికి వీలుగా కమ్యూనిటీ పోలీసింగ్ వ్యవస్థని గ్యారంటీ చేస్తుంది.**

★ ప్రతి కాలనీలో, మొహల్లాలో స్థానిక ప్రజలు స్థానిక భద్రతలో పాలు పంచుకునే ఏర్పాట్లు చేస్తుంది.

★ కులాలు, మతాల రూపంలో ద్వేషాలు, ఘర్షణలు తలెత్తకుండా ప్రజల భాగస్వామ్యంతో ముందు జాగ్రత్తలు తీసుకుంటుంది; అలాంటి హింస తలెత్తితే నిర్దాక్షిణ్యంగా అణచివేస్తుంది.

రాష్ట్రంలో 1000 చిన్న పట్టణాలు

# రాష్ట్రంలో 1000 చిన్న పట్టణాలు

# రాష్ట్రంలో 1000 చిన్న పట్టణాలు

రాష్ట్రంలో ఒక వంక ప్రభుత్వాల వైఫల్యం వల్ల వ్యవసాయం ఎదుగూ బొదుగూ లేకుండా ఉన్నది. మరోవంక పొట్ట చేతబట్టుకుని లక్షలాది మంది నగరాలకి వలసపోతున్నారు. ఇలా ప్రతీరోజు 5,000 మంది మన రాష్ట్రంలో సుదూరంగా ఉన్న పెద్ద పట్టణాలకి, నగరాలకి తరలిపోతున్నారు; వీరిలో అత్యధికులు మరికివాడలలో దుర్భర జీవనాన్ని గడుపుతున్నారు. గ్రామీణులకు మంచి ప్రమాణాల విద్య, వైద్య సౌకర్యాలు అందుబాటు కావడం లేదు. తమ నైపుణ్యాలకు తగిన ఉపాధి అవకాశాలు లభించడం లేదు. గ్రామాలలో ఏ చిన్న సమస్య వచ్చినా చాలా దూరంలో ఉన్న నగరాలకి వెళ్ళాల్సి వస్తోంది.

లోక్‌సత్తా ప్రభుత్వం గ్రామీణులకు పట్టణ సౌకర్యాలను అందుబాటులోకి తేవడానికి వీలుగా 1000 చిన్న పట్టణాలని రాష్ట్ర మంతటా అభివృద్ధి చేస్తుంది. గ్రామీణ ఆర్థిక వ్యవస్థని పట్టణాలతో అనుసంధానం చేస్తుంది. గ్రామప్రాంతాలకు ఆధునాతన సౌకర్యాలను అందుబాటులోకి తెస్తుంది. దూర ప్రాంతాలకి వలసలని అరికట్టి ఎక్కడికక్కడ ఉపాధికి, మంచి జీవన ప్రమాణానికి ఏర్పాట్లు చేస్తుంది.

# 16 చిన్న పట్టణాలు

- **ప్రతి గ్రామానికి 10 కిలోమీటర్ల పరిధిలో అన్ని వసతులు, సౌకర్యాలు గల ఒక చిన్న పట్టణం అభివృద్ధికి ఐదేళ్లలో రూ॥ 25 కోట్ల కేటాయింపును లోక్‌సత్తా ప్రభుత్వం గ్యారంటీ చేస్తుంది.**

- రాష్ట్రమంతటా ఇలా 1000 చిన్న పట్టణాలు అభివృద్ధి అవుతాయి. రోడ్డు కూడలి, సహజ వనరులు, చుట్టుపక్కల గ్రామాలలోని ఉత్పత్తులు, మానవవనరులు ఆధారంగా ఈ గ్రామాలని గుర్తించి అభివృద్ధి చేస్తుంది.

- మంచి విద్య, ఆరోగ్య సౌకర్యాలు, మంచినీరు, డ్రైనేజి, పార్కుల నిర్మాణం, లైబ్రరీలు, ఉపాధి శిక్షణ, చిన్న పరిశ్రమల ఏర్పాటుకి రాయితీలు, రోడ్లు, రవాణా సౌకర్యాలు–ఈ వసతుల కోసం అన్ని ఏర్పాట్లని చేసి గ్రామ ప్రాంతాలలో మంచి పట్టణాలు అభివృద్ధి చెందే వాతావరణాన్ని సృష్టిస్తుంది.



# 17 గ్రామాలకు అందుబాటులో పట్టణ వసతులు

★ **ప్రతి గ్రామానికి అందుబాటులో పట్టణ వసతులు, సేవలను లోక్‌సత్తా ప్రభుత్వం గ్యారంటీ చేస్తుంది.**

★ ప్రతి చిన్న పట్టణంతో చుట్టుపక్కల గ్రామాలు అనుసంధాన మయ్యేలా రోడ్డు, బస్సు సౌకర్యాలు ఏర్పాటవుతాయి.

★ ఈ చిన్న పట్టణాలలో ప్రభుత్వంతో అన్ని లావాదేవీలని నిర్వహించే ఇ-సేవా కేంద్రం, కంప్యూటర్ శిక్షణ, ఉపాధిశిక్షణ అందరికీ అందుబాటులో ఉంటాయి.

★ ప్రతి చిన్న పట్టణంలో కనీసం 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రి ఉంటుంది. 108 సేవలకి ఆ చిన్న పట్టణం కేంద్రమవుతుంది.

★ వ్యవసాయం మార్కెటు, గోడౌన్లు ప్రతి చిన్న పట్టణంలోను ఏర్పటవుతాయి.

★ గ్రామాలలోని అగ్రిక్లినిక్‌లకి ఈ చిన్న పట్టణాలు నోడల్ కేంద్రాలవుతాయి.

విద్యతో అందరికీ ఎదిగే అవకాశం

# విద్యతో అందరికీ ఎదిగే అవకాశం

# విద్యతో
# అందరికీ ఎదిగే అవకాశం

మన సమాజంలో నూటికి 90 మంది భవిష్యత్తు పుట్టుకని బట్టి, వారి కుటుంబ బీదరికాన్ని బట్టి నిర్ణయమవుతున్నది. మన జనాభాలో కేవలం 8 శాతం మంది మాత్రమే స్కూలు పూర్తి చేసి ఉన్నత విద్యకి వెళ్ళగలుగుతున్నారు. చిన్న క్లాసులకి పంపడానికి కూడా బీదలు శక్తికి మించి ఖర్చు పెట్టాల్సి వస్తున్నది. ఇంత చేసినా మంచి చదువు అందడం లేదు.

లోక్‌సత్తా ప్రభుత్వం ఈ పరిస్థితిని సమూలంగా మార్చి, అందరికీ ఉన్నత ప్రమాణాల విద్యని అందిస్తుంది. మొత్తం రాజకీయానికి, పాలనకి విద్యని కేంద్రంగా చేస్తుంది. వివక్ష లేని సమాజాన్ని సృష్టించి పుట్టిన ప్రతి బిడ్డకి సామాజిక, ఆర్థిక అంతరాలకు అతీతంగా విద్యనందిస్తుంది. ప్రతి బిడ్డ తెలివితేటలు వికసించే అవకాశాన్ని కల్పించి, ఒకతరం కాలంలో కులాన్ని, దానితో పాటు పేదరికాన్ని అంతం చేస్తుంది.

# 18 ప్రభుత్వ - ప్రయివేటు విద్యలు ఇకపై సమానం

- **ప్రభుత్వ - ప్రైవేటు తేడా లేకుండా అందరికీ ఒకే ప్రమాణాలు, ఒకే రకమైన విద్యాబోధనను లోక్‌సత్తా ప్రభుత్వం గ్యారంటీ చేస్తుంది.**
- లోక్‌సత్తా పార్టీ ప్రభుత్వం అత్యున్నత ప్రమాణాలతో 12వ తరగతి దాకా అందరికీ ఉచిత విద్య అందిస్తుంది.
- 3 ఏళ్ళు నిండిన పిల్లలందరికీ దగ్గరలో ఆటపాటలతో, పౌష్టికాహారంతో ప్రీ-స్కూలు సౌకర్యం కలిగిస్తుంది.
- 1 నుండి 5 తరగతుల వరకు మాతృభాషలో బోధన, ఇంగ్లీష్ భాషను నేర్పించడం.
- 6 నుండి 12వ తరగతి వరకు మంచి ప్రమాణాల ఇంగ్లీష్ మీడియంలో బోధనను, కంప్యూటర్ విద్యను, కనీసం రెండు భాషలలో ప్రావీణ్యాన్ని అందిస్తుంది.
- ఇంటర్మీడియట్‌స్థానే హైస్కూలులోనే 12వ తరగతి వరకు విద్యాబోధన.
- అన్ని జాతీయ, రాష్ట్రస్థాయి ఎంట్రన్స్ పరీక్షల కోసం ప్రతి విద్యార్థికి ఉచితంగా ఉన్నత ప్రమాణాల కోచింగ్‌ను ఇప్పిస్తుంది.

19

# ప్రతి స్కూలుకి ఆధునిక వసతులు

★ **ప్రతి స్కూలులో తరగతులకు తగినన్ని గదులు, ప్రతి తరగతికి ఉపాధ్యాయుడు, బోధనా పరికరాలు, కంప్యూటర్‌లు, బ్రాడ్‌బాండ్‌తో ఇంటర్నెట్, విద్యుత్ సరఫరా సౌకర్యాలను లోక్‌సత్తా ప్రభుత్వం గ్యారంటీ చేస్తుంది.**

★ ప్రతి హైస్కూల్‌ని బ్రాడ్‌బాండ్ ఇంటర్నెట్ ద్వారా అనుసంధానిస్తుంది.

★ ఆటస్థలం, మరుగుదొడ్లు, మంచినీరు వంటి మౌలిక సౌకర్యాలను విధిగా కల్పిస్తుంది.

★ అవసరమున్న విద్యార్థులందరికి ఉచిత ప్రయాణ సౌకర్యాలని కలిగిస్తుంది.

★ వైద్య, ఆరోగ్య సదుపాయాలను స్కూలులోనే ఏర్పాటు చేస్తుంది.



20

# ఉపాధ్యాయులకు ఇక కీలక స్థానం

- **టీచర్లకి విద్యావ్యవస్థలో, పాఠశాల యాజమాన్యంలో భాగస్వామ్యాన్ని లోక్‌సత్తా ప్రభుత్వం గ్యారంటీ చేస్తుంది.**
- ఉపాధ్యాయులను జీతగాళ్ళుగా కాక, పిల్లల భవిష్యత్తు తీర్చిదిద్దే సృజనశిల్పులుగా గుర్తింపుని, గౌరవాన్ని ఇస్తుంది. విద్యావలంటీర్లు, కాంట్రాక్టు టీచర్లు / లెక్చరర్లకు గౌరవప్రదమైన పారితోషికాన్ని ఇస్తుంది.
- జిల్లా, మండల విద్యాబోర్డులలో అధ్యాపకులకు కీలక పాత్ర కల్పిస్తుంది.
- టీచర్లకి బోధనేతర బాధ్యతల నుంచి విముక్తి కలిగిస్తుంది.
- తగినంత సిబ్బందితో, తనిఖీ యంత్రాంగంతో, ఉన్నత ప్రమాణాలను సాధిస్తుంది.
- అధ్యాపకుల పదోన్నతులకి అవకాశాలు కల్పిస్తుంది.
- ఉపాధ్యాయులకు ఆధునిక బోధనా పద్ధతులపై తరచుగా శిక్షణ ఇప్పిస్తుంది.
- ఉపాధ్యాయుల కుటుంబాలకు గ్రామాలలో పాఠశాలల వద్దే నివాస సౌకర్యం కల్పిస్తుంది.

21

# డబ్బు లేకపోయినా ఎవరి చదువు ఇక ఆగదు

- **బీదరికం కారణంగా చదువు ఆపవలసిన అవసరం ఎవరికీ లేకుండా, ఆసక్తి, అర్హత ఉన్న ప్రతి విద్యార్థికి ఇంజనీరింగ్, మెడిసిన్, కంప్యూటర్స్, అన్ని వృత్తి విద్యలు, యూనివర్సిటీలో చదువును జేబులో నుండి ఖర్చు లేకుండా లోక్‌సత్తా ప్రభుత్వం గ్యారంటీ చేస్తుంది.**

- ఉన్నత విద్యాసంస్థల్ని సమూలంగా సంస్కరిస్తుంది. మారుతున్న సమాజానికి అనుగుణంగా అత్యాధునిక పరిజ్ఞానాన్ని, అవసరమైన నైపుణ్యాలను అందించే ఏర్పాటు చేస్తుంది.

- ప్రతి జిల్లాకి ఒక ఉన్నత విద్యా జోన్‌ని ఏర్పాటు చేసి, అక్కడ అత్యున్నత ప్రమాణాలతో కళాశాలలని ఏర్పాటు చేసేవారికి ప్రోత్సాహం, రాయితీలు కల్పిస్తుంది.

# 22 గ్రామాల పిల్లలకు, బీదలకు 10% బోనస్ మార్కులు

★ **కులంతో, మతంతో నిమిత్తం లేకుండా పేద కుటుంబాల పిల్లలకి, గ్రామాలలో పెరిగిన పిల్లలకి ప్రవేశ పరీక్షలలో 10 శాతం బోనస్ మార్కులు గ్యారంటీ చేస్తుంది.**

★ రిజర్వేషన్ ఫలితాలు అన్ని కులాలలోని బీదలకి దక్కేలా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తుంది.

★ అంటే గ్రామాల పిల్లలకి, పేద కుటుంబాల పిల్లలకి 600 మార్కులకి 60 మార్కులు బోనస్‌గా కలిపి, ఉన్నత విద్యకి, ఉద్యోగాలకి సంపన్నుల పిల్లలతో సమానంగా పోటీపడే అవకాశాన్ని కల్పిస్తుంది.



యువతకు నైపుణ్యం, ఉపాధి

# యువతకు నైపుణ్యం, ఉపాధి



# యువతకు నైపుణ్యం, ఉపాధి

రాష్ట్రంలో 10 లక్షల మందికి పైగా విద్యావంతులైన యువతీయువకులు నైపుణ్యాలు, అవకాశాలు లేక నిరుద్యోగులుగా వున్నారు. లోక్‌సత్తా ప్రభుత్వం వీరందరికీ అవసరమైన నైపుణ్యాలను ఇచ్చి, వారందరికి ప్రభుత్వ, ప్రైవేటు రంగాలలో ఉపాధి కల్పిస్తుంది. ఆత్మవిశ్వాసాన్ని పెంచి సమాజానికి ఉపయోగపడే పౌరులుగా వారిని తీర్చిదిద్దుతుంది. సొంత వ్యాపారాన్ని, వృత్తిని, పరిశ్రమని చేపట్టగోరే వారికి ప్రత్యేక శిక్షణనిచ్చి, రుణసౌకర్యంతో సహా వారికి కావలసిన సదుపాయాలన్నీ అందిస్తుంది. కష్టపడే శక్తి వున్న ప్రతి యువతికి, యువకుడికి తన కాళ్ళమీద తాను నిలబడే అవకాశాన్ని కల్పించి, ఆత్మగౌరవాన్ని పెంపొందిస్తుంది.

# 23 యువతకు 'దిక్సూచి'

★ **మారుతున్న సమాజం, మార్కెట్ అవసరాలకు అనుగుణంగా నిపుణులు రూపొందించే ప్రత్యేక శిక్షణను యువతీయువకులందరికీ గ్యారంటీ చేస్తుంది.**

★ రాష్ట్రంలో 200కి పైగా 'దిక్సూచి' శిక్షణ కేంద్రాలలో యువతకు ఉచితంగా నైపుణ్యం అందిస్తుంది.

★ కోర్సుని బట్టి 3 నెలల నుంచి 12 నెలల దాకా ఉచిత శిక్షణని ఇప్పిస్తుంది.

★ శిక్షణ కాలంలో నెలకి రూ॥ 1500/- స్టైపెండ్ ఇస్తుంది.

★ శిక్షణ రూపకల్పనలో, అమలులో పరిశ్రమల, బ్యాంకుల భాగస్వామ్యం ఉంటుంది.



## 24 ఉపాధికి ఏర్పాట్లు

★ **నైపుణ్యం ఉన్న ప్రతి వ్యక్తికి ఏదో ఒక ఉపాధి అవకాశాన్ని గ్యారంటీ చేస్తుంది.**

★ శిక్షణ పొందిన ప్రతి యువతికి, యువకుడికి ఉపాధి కోసం ప్రపంచవ్యాప్తంగా ప్లేస్‌మెంట్ల ఏర్పాటు చేస్తుంది.

★ సొంత వృత్తిని, వ్యాపారాన్ని చేపట్టేవారికి విధిగా రుణాలు, మౌలిక సదుపాయాలనందిస్తుంది.



# 25 ప్రభుత్వంలో ఉపాధి అవకాశాలు

- **లోక్‌సత్తా ప్రభుత్వంలో విద్య, ఆరోగ్యం, నేర పరిశోధన, న్యాయం, మౌలిక సేవల కల్పన రంగాలలో అదనంగా 1,50,000 మందికి ఉపాధిని గ్యారంటీ చేస్తుంది.**
- విద్యుత్తు పంపిణీని వికేంద్రీకరించడం ద్వారా పంపిణీ అజమాయిషీలో స్థానికంగా సుమారుగా 60,000 మందికి అదనంగా ఉపాధిని కల్పిస్తుంది.
- ప్రభుత్వ - ప్రైవేటు భాగస్వామ్యంలో అందించే సేవలన్నింటిలో అదనపు ఉపాధిని రాష్ట్ర యువతకు కల్పిస్తుంది.
- జిల్లా ప్రభుత్వాలను ఏర్పాటు చేసి, వాటి నిర్వహణ కోసం ప్రత్యేకంగా అదనపు సిబ్బందిని నియమిస్తుంది.

## 26 ‘జాతీయ సేవాబృందం’

★ జాతీయ సేవాబృందం పేరుతో స్వచ్ఛందంగా, రెండేళ్ళపాటు, జాతీయ అభివృద్ధి లక్ష్యాల కోసం, సమాజసేవ కార్యకలాపాలలో రాష్ట్ర యువత ప్రత్యక్షంగా పాలుపంచుకునే అవకాశాలను కలిగిస్తుంది.

★ **ఈ జాతీయ సేవాబృందం కోసం ఏటా లక్షమందిని ఎంపిక చేసి, వివిధ రంగాలలో స్థానిక అవసరాలకు సరిపోయే శిక్షణను ఇప్పించి, వారికి రెండేళ్ళపాటు నెలకి రూ|| 3,000 సేవా పారితోషికాన్ని లోక్‌సత్తా ప్రభుత్వం గ్యారంటీ చేస్తుంది.**

★ ఎప్పుడైనా సరే రెండు లక్షల మంది యువ సామాజిక కార్యకర్తలు జాతీయ సేవాబృందంలో పనిచేస్తుండే విధానాన్ని అమలు చేస్తుంది.

★ విద్య, ఆరోగ్యం, ప్రజలలో చైతన్యం, వివిధ సేవలు, అవినీతిపై పోరాటం, వ్యవసాయ విస్తరణ, వివిధ పథకాల అమలు వంటి రంగాలలో అవసరాల్ని బట్టి వారి సేవలని స్థానిక ప్రభుత్వాలు వినియోగించుకుంటాయి.

అందరికీ ఉచితంగా వైద్యసేవలు

# అందరికీ ఉచితంగా వైద్య సేవలు



# అందరికీ ఉచితంగా వైద్య సేవలు

ప్రస్తుతం రకరకాల వ్యాధులు, అనారోగ్యాల వలన లక్షల కుటుంబాలు చితికి పోతున్నాయి. ఆసుపత్రి పాలయిన వారు వైద్యం కోసం విపరీతమయిన ఖర్చు చేయాల్సి వస్తోంది; ఆ కారణంగా అప్పులపాలై మధ్య తరగతి వారు కూడా పేదరికంలో కూరుకుపోతున్నారు. సకాలంలో చికిత్స అందక చిన్న జబ్బులు కూడా ప్రాణాంతకం అవుతున్నాయి. ప్రసూతి వైద్యం అందక తల్లి, బిడ్డల ఆరోగ్యం దెబ్బ తింటున్నది; ప్రాణహాని జరుగుతున్నది. ఎందరో తల్లులు గర్భశోకంతో కుమిలి పోతున్నారు.

లోక్‌సత్తా ప్రభుత్వం రాష్ట్రంలో ప్రతి ఒక్కరికి అన్ని జబ్బులకి మంచి ప్రమాణాలతో ఉచితంగా ఆరోగ్య సేవల్ని అందించే గ్యారంటీ ఇస్తుంది. ప్రభుత్వ, ప్రైవేటు తేడా లేకుండా ఏ వైద్యశాలలో అయినా ఉచితంగా ఆరోగ్య సేవల్ని ప్రభుత్వ ఖర్చుతో పొందే హక్కుని కల్పిస్తుంది. అనారోగ్యం వస్తే ఎక్కడికి వెళ్ళాలి, ఎవరిని ఆశ్రయించాలి, డబ్బు ఎట్లా అనే భయాందోళనలు ఇక ఏ కుటుంబానికి లేకుండా చేస్తుంది.

# 24 గంటలు వైద్యం

## 27 ఉచితంగా నాణ్యమైన వైద్య సేవలు

- ★ **ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 24 గంటలు ప్రసూతి, అత్యవసర సేవలు అందించే ఏర్పాటు, ప్రతి 75,000 మందికి అన్ని సౌకర్యాలతో, వైద్యులతో 30-100 పడకల ఆసుపత్రి ఏర్పాటును లోక్‌సత్తా ప్రభుత్వం గ్యారంటీ చేస్తుంది.**
- ★ గవదబిళ్ళలు, పొంగు, రుబెల్లాల నివారణకి, పుట్టుకతో వచ్చే లోపాలు తొలగించటానికి ప్రతి బిడ్డకి యం.యం.ఆర్ టీకాలు నిర్బంధంగా వేయిస్తుంది.
- ★ ప్రతి జిల్లాలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని నెలకొల్పుతుంది. ఏ వైద్య సేవకైనా జిల్లా దాటి వెళ్ళవలసిన అవసరం ఇక వుండదు.

# 28 అందరికీ 'ఆరోగ్యరక్ష'

★ **రాష్ట్రంలో ప్రతి కుటుంబము తమకు నచ్చిన ఏ ప్రభుత్వ లేదా ప్రైవేటు ఆసుపత్రులలోనైనా ఉచితంగా వైద్యం చేయించు కోడానికి 'ఆరోగ్యరక్ష' కార్డును లోక్‌సత్తా ప్రభుత్వం గ్యారంటీ చేస్తుంది.**

★ ఏ ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రిలోనైనా వైద్య పరీక్షలు, ఆసుపత్రిలో పడక, ఆపరేషన్లు, మందులకు అన్ని ఖర్చులను లోక్‌సత్తా ప్రభుత్వమే భరిస్తుంది.

★ మలేరియా నుంచి గుండెజబ్బుదాకా, టైఫాయిడ్ నుంచి ప్రసూతి వైద్యం, కడుపునొప్పి దాకా అన్ని జబ్బులకీ మంచి ప్రమాణాలతో ఆరోగ్యరక్ష కార్డు ద్వారా అందరికీ ఉచిత వైద్యం కల్పిస్తుంది.



# 29 'ఉభయతారకం'

- ప్రభుత్వ ఆసుపత్రులతో పాటు, మౌలిక సౌకర్యాలు వున్న ప్రైవేటు ఆస్పత్రులు, క్లినిక్‌లు ప్రజలకు ఉచిత ఆరోగ్య సేవలందిస్తాయి.
- ప్రతి సేవకి రుసుము నిర్ణయించి, వచ్చిన రోగులకు అందించిన సేవలని బట్టి ప్రతి నెల ప్రభుత్వం వారికి డబ్బు చెల్లిస్తుంది.
- **మంచి వైద్యసేవలతో గరిష్టస్థాయిలో రోగులకు సేవలందించే ఆసుపత్రులకు, వైద్యులకు, సిబ్బందికి ఎక్కువ ఆదాయాన్ని గ్యారంటీ చేస్తుంది.**
- ప్రభుత్వ ఆసుపత్రులలో కూడా ప్రైవేటు డాక్టర్లు, సిబ్బంది పనిచేసి తగిన ఆదాయం పొందవచ్చు.



లోక్‌సత్తా పార్టీ వ్యవ ‘ సాయం ’

# లోక్‌సత్తా పార్టీ వ్యవ ‘ సాయం ’



# లోక్‌సత్తా పార్టీ వ్యవ‘సాయం’

ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పటికీ 70 శాతం మంది ప్రజలు వ్యవసాయం పైనే ఆధారపడి జీవిస్తున్నారు. వ్యవసాయం ఎదుగూ బొదుగూ లేకుండా ‘అమ్మబోతే అడవి, కొనబోతే కొరివి’ చందాన వుంది. నకిలీ విత్తనాలు, నాసిరకం పురుగుమందులు రాజ్య మేలుతున్నాయి. బ్యాంకు రుణాలు, సాంకేతిక విజ్ఞానం 70 శాతం రైతులకి అందడం లేదు. మార్కెట్‌లో మోసాలు, దళారీలు, రైతులకు పెనుశాపంగా మారాయి.

లోక్‌సత్తా ప్రభుత్వం ఈ పరిస్థితిని సమూలంగా మార్చి వ్యవసాయాన్ని సంఘటితరంగంగా, లాభసాటి పరిశ్రమగా తీర్చిదిద్దుతుంది.

30

# రైతులకు నాణ్యమైన విద్యుత్తు

★ **వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్‌లని వేరు చేసి, ఓల్టేజి హెచ్చుతగ్గులు లేని నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేస్తుంది. ఓల్టేజీ లోపం వల్ల మోటార్లు కాలితే నష్టపరిహారాన్ని లోక్‌సత్తా ప్రభుత్వం గ్యారంటీ చేస్తుంది.**

★ విద్యుత్ పంపిణీ నిర్వహణ బాధ్యతను స్థానిక ప్రభుత్వాలకి, ప్రజలకి అప్పగిస్తుంది.

★ పంపిణీని మెరుగు పరచటానికి కావలసిన నిధులు అందిస్తుంది.



31

# 'రైతుసిరి' అగ్రిక్లినిక్‌లు

★ **'రైతుసిరి' అగ్రిక్లినిక్‌ల ద్వారా రైతులందరికి:**

**అ) సరసమైన ధరలకే నాణ్యమైన విత్తనాలు, పురుగు మందులు, వ్యవసాయ పరికరాలు**

**ఆ) వ్యవసాయ ఉత్పత్తుల్ని లాభసాటి ధరలకు నేరుగా అమ్ముకునే ఏర్పాట్లు**

**ఇ) ఏ సమస్య పైనైనా 24 గంటలలోగా సలహా, సహాయం**

**ఈ) రైతులు వేసే పంటల నమోదు**

**ఉ) మార్కెట్‌ని గూర్చి తాజా సమాచారం**

**ఊ) ఉచితంగా భూసార పరీక్షలు**

**ఎ) ఉచితంగా పశువైద్య సేవలు**

**అందేలా గ్యారంటీ చేస్తుంది.**

★ ప్రతి 3,000 ఎకరాల భూమికి, పూర్తి కంప్యూటర్ సేవలతో ఈ అగ్రిక్లినిక్‌ల ఏర్పాటు చేస్తుంది.

★ వ్యవసాయ పరికరాల పై అన్ని రకాల పన్నులు మాఫీ చేస్తుంది. అగ్రిక్లినిక్‌ల ద్వారా ఎక్స్‌ఫ్యాక్టరీ రేట్లకే రైతుల కొనుగోలుకు ఏర్పాట్లు చేస్తుంది.

★ వ్యవసాయ ఉత్పత్తుల్ని లాభసాటి ధరలకి రైతులు ఉమ్మడిగా, ప్రత్యక్షంగా, రిటైల్ చైన్‌లకి, సూపర్‌మార్కెట్లకి అమ్ముకునే ఏర్పాటు చేస్తుంది.

32

# 'అక్షయ' కార్డు - చింత లేని రుణం

★ **'అక్షయ' కార్డుతో ప్రతి రైతుకి భూమి, స్థిరాస్తిని బట్టి క్రెడిట్ సౌకర్యాన్ని కల్పిస్తుంది, విస్తరిస్తుంది. వ్యవసాయ, కుటుంబ అవసరాలను బట్టి పరిమితి లోపల, ఎప్పుడు కావాలంటే అప్పుడు రుణం పొందే ఓవర్‌డ్రాఫ్ట్ పద్ధతిని గ్యారంటీ చేస్తుంది.**

★ ప్రతి రైతుకి సహకార, వాణిజ్య బ్యాంకులలో ఎకౌంటు ఏర్పాటు చేస్తుంది.

★ పరిమితికి మించిన అధిక వడ్డీ అప్పులని నిషేధిస్తుంది. అలాంటి ప్రైవేటు రుణాలను రద్దు చేస్తుంది.

★ కౌలుదారుకి పంట రుణం కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తుంది.



## 33 ఇక పై 'రైతే రాజు'

- **పూర్తి ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన రైతు కమిటీల చేతుల్లో మార్కెట్‌యార్డుల యాజమాన్యం వుండేలా, మార్కెట్‌యార్డుల పనితీరులో అవినీతి - అక్రమాలు లేకుండా లోక్‌సత్తా ప్రభుత్వం గ్యారంటీ ఇస్తుంది.**
- మార్కెట్‌యార్డులో ప్రత్యక్షంగా అమ్ముకునే ఏర్పాటును, రిటైల్ మార్కెట్ చైన్లతో అనుసంధానం, అంతర్జాతీయ మార్కెట్ల సమాచారం,ఉత్పత్తుల ఎగుమతికి తగిన ఏర్పాట్లు మార్కెట్ యార్డులు చేస్తాయి.
- ఉత్పత్తుల నిలవకు సౌకర్యాలు, నిలవ ఉంచిన పంటలపైన ప్లెడ్జి లోనులు అందిస్తుంది.
- ముఖ్యంగా, త్వరగా చెడిపోయే పంటలకి (పళ్ళు, కూరగాయాలు) శీతల గిడ్డంగులు, రేడియేషన్ సెంటర్లతో కూడిన నిలవ సౌకర్యాన్ని కల్పిస్తుంది.
- ఈ మార్కెట్‌యార్డులు నాణ్యమైన వ్యవసాయ విత్తనాలు, పురుగు మందులు, పరికరాల అమ్మక కేంద్రాలుగా కూడా సేవలందిస్తాయి. మార్కెట్‌ని బట్టి 'విత్తనక్షేత్రాలు' ఏర్పాటు చేస్తాయి.
- ఆధునిక కబేళాలను ఏర్పాటు చేసి మాంస ఉత్పత్తికి అన్ని సౌకర్యాలను మార్కెట్‌యార్డులు కల్పిస్తాయి.

34

# మద్దతు ధరనిచ్చే ఆగ్రో పరిశ్రమలు

- **పళ్ళు, కూరగాయాలకి ప్రకటించిన కనీస మద్దతు ధరను అందించే ఆగ్రోపరిశ్రమల ఏర్పాటును లోక్‌సత్తా ప్రభుత్వం గ్యారంటీ చేస్తుంది.**
- మార్కెట్‌లో ధరలు తగ్గినప్పుడు మద్దతు ధరకి కొనుగోలు జరిగేలా చేస్తుంది.
- పంటల విలువ పెంచే ఆగ్రోపరిశ్రమల ఏర్పాటు చేస్తుంది.
- ఆగ్రోపరిశ్రమలు తమ ఉత్పత్తులని అమ్ముకొవటం కోసం రాష్ట్ర ఫెడరేషన్ ఏర్పాటు చేసి, అవి నిలదొక్కుకోవటం కోసం ప్రభుత్వం సబ్సిడీని అందిస్తుంది.
- రైతుల పిల్లలకి శిక్షణ ఇస్తుంది. ఆగ్రోపరిశ్రమలలో ఉపాధి కల్పిస్తుంది.



కఠిన మద్య నియంత్రణ

# కఠిన మద్య నియంత్రణ



# కఠిన మద్య నియంత్రణ

రాష్ట్రంలో దాదాపు 75 లక్షల కుటుంబాలు మద్యం మహమ్మారికి బలైపోతున్నాయి. తాగుడుకి బానిసలయిన వారు ఆర్థికంగా చితికి పోతున్నారు; ఆరోగ్యం క్షీణించి అకాలమరణానికి గురవుతున్నారు. వారి పిల్లలు ఆలనాపాలనా లేకుండా నలిగి పోతున్నారు. మహిళలు భయంకర నరకాన్ని అనుభవిస్తున్నారు.

లోక్‌సత్తా ప్రభుత్వం మద్యాన్ని కఠినంగా నియంత్రించి బీద కుటుంబాలని ఆదుకుంటుంది.

35

# ప్రయివేటు మద్యం షాపులు రద్దు

- **ప్రయివేటు లైసెన్సు షాపుల వేలంపాటల రద్దును లోక్‌సత్తా ప్రభుత్వం గ్యారంటీ చేస్తుంది.**
- మద్యం ప్రభుత్వానికి ఆదాయమార్గం కాకుండా చేస్తుంది.
- ప్రస్తుతం వున్న 6,800 మద్యం షాపుల సంఖ్యని 1000 లోగా తగ్గించి, ప్రభుత్వమే పరిమిత వేళల్లో మద్యం అమ్మే ఏర్పాటు చేస్తుంది.



## 36 బెల్టు తీస్తాం

★ **గ్రామాలలో, బీదల వాడలలో మద్యం అమ్మకాల నిషేధాన్ని లోక్‌సత్తా ప్రభుత్వం గ్యారంటీ చేస్తుంది.**

★ పేద కుటుంబాలలో చిచ్చుపెట్టే బెల్టుషాపుల్ని పూర్తిగా నిర్మూలిస్తుంది.

★ నాటుసారా, గుడుంబా, కల్తీకల్లు తయారీని, అమ్మకాలను ఉక్కుపాదంతో అణిచివేస్తుంది.

★ తాగుడుకు బానిసలైన వారి కోసం ప్రతి మండలంలో డీ-ఎడిక్షన్ కేంద్రాలను ఏర్పాటు చేసి, చికిత్సను అందిస్తుంది.

37

# బహిరంగ మద్యపానం పై వేటు

★ రాష్ట్రంలో బహిరంగ మద్యపాన నిషేధాన్ని లోక్‌సత్తా ప్రభుత్వం గ్యారంటీ చేస్తుంది.

★ బహిరంగంగా తాగినా, మద్యం మత్తులో బయట కనిపించినా దాన్ని నేరంగా పరిగణించి శిక్షిస్తుంది.

★ స్టార్‌హోటళ్లు, టూరిస్టు కేంద్రాలలో పరిమితంగా తప్ప అన్ని సిట్టింగ్ రూములను మూసివేస్తుంది. రహదారుల వెంట మద్యం అందుబాటు కాకుండా చేస్తుంది.

★ తాగిన మత్తులో వాహనాలు నడిపినా, ఇతర నేరాలు చేసినా కఠినంగా శిక్షించే ఏర్పాటు చేస్తుంది.



# 38 పంచాయతీలకే సర్వాధికారాలు

- **అక్రమ మద్యం, సారా, గుడుంబాల సోదా, సరుకు స్వాధీనం, పరికరాల ధ్వంసం, అరెస్టు, కోర్టు ముంగిట పెట్టటం వంటి అధికారాలను గ్రామ పంచాయితీలకు గ్యారంటీ చేస్తుంది.**
- కఠిన మద్య నియంత్రణను అమలు చేసే బాధ్యతని పంచాయతీలకి, స్థానిక మహిళాసంఘాలకి అప్పగిస్తుంది.
- బెల్టుషాపులని, అక్రమసారాని అరికట్టడంలో గ్రామ పంచాయతీ విఫలం అయితే, అవసరమైతే ఆ పంచాయితీ రద్దుతో సహా తీవ్రమైన చర్యలను లోక్‌సత్తా ప్రభుత్వం తీసుకుంటుంది.

# సమన్యాయం, సత్వర న్యాయం



# సమన్యాయం, సత్వర న్యాయం

బడాబాబులకొక న్యాయం, బడుగు జీవులకొక న్యాయం అనే పరిస్థితి మన రాష్ట్రంలో నెలకొని ఉంది. పోలీసుల విధి నిర్వహణలో రాజకీయ జోక్యం, ఒత్తిళ్ళు తీవ్ర అడ్డంకులుగా మారాయి. కోర్టులలో న్యాయం ప్రజలకు అందుబాటులో లేకుండా పోయింది.

పోలీసు వ్యవస్థ, న్యాయ వ్యవస్థలలో సమూలమైన సంస్కరణల ద్వారా అందరికీ అందుబాటులో ఒకే న్యాయం అందేటట్లు లోక్‌సత్తా ప్రభుత్వం చేస్తుంది.

## 39 ప్రజాసేవకే పోలీసు వ్యవస్థ

- **రాజకీయ జోక్యానికి, ఒత్తిళ్ళకి అవకాశం లేకుండా, స్వతంత్ర ప్రతిపత్తి గల నేర పరిశోధనా వ్యవస్థ ఏర్పాటును లోక్‌సత్తా ప్రభుత్వం గ్యారంటీ చేస్తుంది.**
- నేరపరిశోధన, శాంతిభద్రతలు, పౌరపోలీసు విభాగాలుగా పోలీసు వ్యవస్థను పునర్ వ్యవస్థీకరిస్తుంది.
- పోలీస్ స్టేషన్‌లో చేసిన ప్రతి ఫిర్యాదుకు ఎఫ్.ఐ.ఆర్ నమోదు ఖచ్చితంగా జరుగుతుంది.
- పోలీసు ఇంటరాగేషన్ సమయంలో వీడియో కెమేరాలతో రికార్డింగ్ తప్పనిసరి చేస్తుంది.
- పోలీసు సిబ్బందిని ఆర్డర్లీగా ఉపయోగించటాన్ని నిషేధించి, ఖచ్చితంగా అమలు చేస్తుంది.
- పోలీసుల నియమాకాన్ని ఎ.ఎస్.ఐ. స్థాయిలో చేపట్టి, సిబ్బందికి గౌరవాన్ని, వృత్తిలో రాణించే అవకాశాన్ని కల్పిస్తుంది.
- సత్వర నేర పరిశోధన కోసం ఆధునిక ప్రమాణాలతో జిల్లాకొక ఫొరెన్సిక్ ల్యాబ్ (నేర పరిశోధన కేంద్రం) ఏర్పాటవుతుంది.

# 40 సత్వర న్యాయం, ఇంటి ముంగిట న్యాయం

- ★ **న్యాయ వ్యవస్థలో అంతర్భాగంగా ప్రతి మండలానికి ఒక స్థానిక న్యాయాలయాన్ని ఏర్పరచి స్థానిక భాషలో, సులభ పద్ధతులలో న్యాయ విచారణ పూర్తి చేసి 90 రోజులలో తీర్పు ఇచ్చే ఏర్పాటును గ్యారంటీ చేస్తుంది.**
- ★ నిర్దిష్ట పరిమితి లోపల ఆస్తి, డబ్బు వివాదాలు, సంవత్సరంలోపు జైలుశిక్ష వేసే కేసులు స్థానిక న్యాయాలయం పరిధిలోకి వస్తాయి.
- ★ సాక్ష్యాల సేకరణ, విచారణ అవసరాన్ని బట్టి వివాద స్థలంలోనే జరుగుతుంది.
- ★ ఒక న్యాయమూర్తి నేతృత్వంలో జిల్లాకొక స్వతంత్ర ప్రతిపత్తి గల ప్రాసిక్యూషన్ వ్యవస్థను లోక్‌సత్తా ప్రభుత్వం ఏర్పాటు చేస్తుంది.
- ★ అవసరాన్ని బట్టి అదనంగా కోర్టులని ఏర్పాటు చేసి సివిల్, క్రిమినల్ కేసులలో విచారణని త్వరగా పూర్తయ్యే సౌకర్యాలు కల్పిస్తుంది.
- ★ స్థానిక పోలీసుల నేరపరిశోధన అధికారాలు, స్థానిక కోర్టు నేర విచారణ ఒకే అంశాలపై ఉంటాయి.

స్వాహారాజ్యం అంతం కోసం...

# స్వాహారాజ్యం అంతం కోసం...



## స్వాహారాజ్యం అంతం కోసం...

నేడు రాజకీయ, పాలనా రంగాలలో అవినీతి తాండవిస్తోంది. వ్యాపార రాజకీయ సంస్కృతిలో పూర్తిగా కూరుకు పోయిన ప్రధాన రాజకీయ పార్టీలు ఎన్నికలలో ఓట్ల కొనుగోలుకి కోట్ల రూపాయలు ఖర్చు, విచ్చలవిడిగా మద్యం పంపిణీ చేస్తున్నాయి. దీనికి పదిరెట్లు కాంట్రాక్టులు, టెండర్లు, ట్రాన్స్ఫర్లు, పోస్టింగ్‌లు, భూకబ్జాలు రూపంలో తిరిగి దండుకుంటున్నారు.

ఈ స్వాహారాజ్యం అంతాన్ని, దోపిడీ లేని రాజకీయాన్ని, అవినీతి రహిత పాలనని లోక్‌సత్తా పార్టీ సాధిస్తుంది.

# 41 అవినీతి పై ప్రత్యేక కోర్టులు

- **అవినీతిపరుల కేసుల విచారణకు ప్రతిజిల్లాకి ప్రత్యేక కోర్టును, అక్రమ ఆస్తుల జప్తుకు, కఠిన శిక్షలకు ప్రత్యేక చట్టాన్ని లోక్‌సత్తా ప్రభుత్వం గ్యారంటీ చేస్తుంది.**
- ప్రత్యేక చట్టం ద్వారా అవినీతిపరులు, ముఖ్యంగా రాజకీయ అవినీతిపరుల అక్రమ ఆస్తులు, అక్రమార్జనను ప్రభుత్వపరం చేసి, వాటిని ప్రజావసరాల కోసం పంపిణీ చేస్తుంది.
- స్వతంత్ర ప్రతిపత్తి గల అవినీతి నిరోధక యంత్రాంగాన్ని నిర్మిస్తుంది. లోకాయుక్తకు విశేషాధికారాలను కల్పిస్తుంది.
- ప్రతి జిల్లాలో స్వతంత్ర ప్రతిపత్తి గల అంబుడ్స్‌మన్‌ని ఏర్పాటు చేస్తుంది. స్థానిక ప్రభుత్వాలలో అవినీతి ఆరోపణలని వెంటనే విచారించి తగిన శిక్షలు, అవసరమయితే పదవుల నుండి తొలగించే ఏర్పాట్లు చేస్తుంది.

## 42 పారదర్శకత, జవాబుదారీతనం

★ **పరిపాలనలో అన్నిస్థాయిలలో:**

**అ) పారదర్శకత కోసం పూర్తి పాలనా సమాచారాన్ని ప్రజలకు హక్కుగా అందించడం**

**ఆ) జవాబుదారీతనం కోసం ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో పౌరహక్కుల పత్రాల (సిటిజన్స్ ఛార్టర్లు) ని ఏర్పాటు చేసి ప్రతిరోజు ఆలస్యానికి ఆ సేవలని బట్టి రూ॥10 నుండి రూ॥100 వరకు ప్రజలకి పరిహారం అమలును**

**గ్యారంటీ చేస్తుంది.**

★ ప్రతి ప్రాజెక్టు అమలు పైన ప్రజాసమీక్ష (పబ్లిక్ హియరింగ్), ప్రతి పథకానికి గ్రామసభలోనే లబ్ధిదారుల గుర్తించే ఏర్పాట్లు చేస్తుంది.

★ పౌరుల ఫిర్యాదుల నమోదుకి నిరంతరం నడిచే టెలిఫోన్ కాల్‌సెంటర్లు ప్రతి జిల్లాలోను, ప్రతి నగరంలోను ఏర్పాటవుతాయి. క్షణాలలో కంప్యూటర్లలో ఫిర్యాదుని నమోదు చేసి, వెంటనే సంబంధిత అధికారికి పంపి, నిర్ణీత కాల పరిమితిలో పరిష్కారం చేసే ఏర్పాట్లుంటాయి.

సాంఘిక న్యాయం

# సాంఘిక న్యాయం



# అందరికీ సామాజిక భద్రత

రాష్ట్రంలో 90 శాతంకు పైగా శ్రామికులు అసంఘటిత రంగంలోనే ఉన్నారు. ఎక్కువ మంది రోజువారి కూలీలుగా ఉన్నారు. అనారోగ్యం వచ్చినా, వయస్సు మళ్ళినా, ఏ ప్రమాదం జరిగినా వారి ఆదాయం ఆగిపోతోంది. వీరి కుటుంబాలు బజారున పడుతున్నాయి. వీరిని ఆదుకోవడానికి ఎలాంటి చట్టాలూ, ఏర్పాట్లూ లేవు.

దుర్భర జీవితాలు అనుభవిస్తున్న చిన్న రైతులు, వ్యవసాయ కూలీలు, చిన్న చిన్న వ్యాపారాలు, చేతివృత్తులు చేసుకునేవారు, చేనేత, కల్లు గీత, వడ్రంగం, కమ్మరి, కుమ్మరి లాంటి సంప్రదాయ వృత్తుల వారు, భవన నిర్మాణ రంగంలోనున్న కార్మికులు, ఇతర కాంట్రాక్టు, కాజువల్ లేబర్లు, హమాలీలు, రోడ్డు రవాణా రంగంలోని ఆటో, లారీ, టాక్సీ, రిక్షాలు నడిపేవారు, ప్రైవేటు స్కూళ్లు, షాపులు, నర్సింగ్‌హోమ్స్, ఇతర సంస్థలలో అసంఘటితంగా ఉన్న వర్కర్లు, అనుబంధంగా పనిచేస్తున్నవారు, డ్వాక్రా, డ్వాక్వా మహిళలు, ఇతర మహిళలకు సామాజిక భద్రత, ఆర్థిక హామీ, సాంఘిక న్యాయం అందించడానికి లోక్‌సత్తా పార్టీ కట్టుబడి ఉంది.

43

# కోటి కుటుంబాలకి 'చేదోడు'

★ **రాష్ట్రంలో కోటి అల్పాదాయ కుటుంబాలకు ఏడేళ్ళలో రూ॥ లక్ష వరకు సమకూర్చి, నికరమైన ఆర్థిక వనరు లేదా పెన్షన్లతో కూడిన జీవన భద్రతను గ్యారంటీ చేస్తుంది.**

★ నెలకి రూ॥ 5000/- కన్నా తక్కువ ఆదాయం కలిగిన కుటుంబాలన్నింటికి జీవన భద్రతకు చట్టబద్ధమైన ఏర్పాట్లను లోక్‌సత్తా ప్రభుత్వం దేశంలో తొలిసారిగా చేసి, వీరికి బ్రతుకుభయాన్ని పోగొడుతుంది.

★ వీరు నెలనెలా ఎంత పొదుపు చేసుకుంటే లోక్‌సత్తా ప్రభుత్వం కూడా అంతే మొత్తాన్ని వారి ఖాతాలో జమచేస్తుంది. ఉదా: ఒక నెలకి రూ॥ 400/- పొదుపు చేసుకుంటే ఏడు సంవత్సరాల లోపు లక్ష రూపాయిలు వరకు అవుతుంది.

★ ఆ తరువాత మొత్తం సొమ్మును తీసుకోవచ్చు. లేదా జీవితాంతం నెలనెలా పెన్షన్ రూపంలో పొందవచ్చు.

★ జమ అయిన మొత్తం నుండి అత్యవసర పరిస్థితుల్లో అప్పు పొందే వీలు వుంటుంది.

# 44 సంపాదించుకోలేని వారికి సంక్షేమం

★ **ఏ ఆదాయమూ లేక బీదరికంలో ఉన్న, తోడ్పాటు అవసరమయిన వారందరికీ జీవన భద్రతను లోక్‌సత్తా ప్రభుత్వం గ్యారంటీ చేస్తుంది.**

★ ఏ ఆదాయమూ లేని నిరుపేద వృద్ధులకి, వితంతువులకి అవినీతికి తావు లేకుండా పెన్షన్లు అందించే ఏర్పాటు లోక్‌సత్తా ప్రభుత్వం చేస్తుంది.

★ వికలాంగులకు జీవన భద్రతని, ప్రత్యేక రాయితీలను కల్పిస్తుంది.

★ సీనియర్ సిటిజన్స్, మాజీ సైనికులు, రిటైర్డ్ ఉద్యోగులకు సమాజ సేవలో భాగస్వామ్యం కల్పిస్తుంది. వీరికి తగిన రాయితీలు అందిస్తుంది.

కుల నిర్మూలన

# కుల నిర్మూలన



# కుల నిర్మూలన

మన సమాజంలో పుట్టుకతో వివక్ష ఇంకా కొనసాగుతోంది. అంతరాలకు, అంతర్గత విభేధాలకు కారణంగా వుంది. ప్రస్తుత రాజకీయం దీన్ని తన స్వప్రయోజనాలకి వినియోగించుకుంటూ తాత్కాలిక ఉపశమన చర్యలతో, ప్రలోభాలతో సరిపెట్టుకుంటున్నది.

పుట్టుకతో వివక్ష అనాగరికమైనది, ప్రజాస్వామ్య విరుద్ధమైనది, మానవ హక్కుల్ని ఉల్లంఘించేది. పుట్టుకతో వివక్ష, కులవివక్షలు లేని సమాజాన్ని సాధించేందుకు, ఏక సమాజంగా పునర్వ్యవస్థీకరించేందుకు లోక్‌సత్తా సంస్కరణోద్యమాన్ని చేపడుతుంది.

# 45 ఒక తరంలో కుల నిర్మూలన

- **కుల, మత, లింగ, పేదరిక వివక్షలకి అతీతంగా అందరికీ సమానంగా ఎదిగే అవకాశాలను లోక్‌సత్తా ప్రభుత్వం గ్యారంటీ చేస్తుంది.**
- ఒక తరం కాలంలో కుల నిర్మూలన లక్ష్యసాధనకి లోక్‌సత్తా ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి వుంది.
- కుల ప్రాతిపదికన లబ్ధి పొందే యస్.సి., ఎస్.టీ, బి.సి లకు తప్ప, ఏ స్కూలు, కాలేజీ, యూనివర్శిటీ రికార్డులలో, ప్రభుత్వ పత్రాలలో వ్యక్తుల కులాల ప్రస్తావన ఇక వుండదు.
- హాస్టళ్లలో, విద్యార్థుల వసతిగృహాలలో అన్ని కులాల వారి పిల్లలు కలిసి వుండేటట్లు, ప్రభుత్వ సహాయంతో నిర్మించబడే నివాసాలు, అందరూ కలిసి జీవించే కాలనీలుగా వుండేటట్లు ఏర్పాట్లు జరుగుతాయి.
- పాఠశాల విద్యలో కులనిర్మూలనకు తగిన అంశాలని చేర్చి అంతరాలు లేని సమాజాన్ని సృష్టిస్తుంది.
- బీదలందరికి, గ్రామీణ ప్రాంతాల వారికి ఉన్నత విద్య, ఉద్యోగాలకు ప్రవేశ పరీక్షలలో 10శాతం బోనస్ మార్కులు కలుస్తాయి. అణగారిన కులాలలోని బీదలకూ ఇదే రీతిలో 10 శాతం బోనస్ మార్కులు కలుస్తాయి. ఇలా వీరందరు

సంపన్నుల కుటుంబాల పిల్లలతో పోటీపడే అవకాశాన్ని లోక్‌సత్తా కల్పిస్తుంది.

★ కులాంతర వివాహాలు చేసుకున్నవారికి, వారి పిల్లలకి ప్రత్యేక ప్రోత్సాహకాలను ఇస్తుంది.

★ వివక్షకి గురయ్యే వర్గాలలోని నిరుపేదలకు ఏదో ఒక ఆస్తిని లోక్‌సత్తా ప్రభుత్వం కల్పిస్తుంది.

★ వివిధ వృత్తులను ఆధునీకరించి వాటిని అందరూ అనుసరించే గౌరవ ప్రదమైన వృత్తులుగా మారుస్తుంది.

★ వివక్షకు గురయ్యే కులాల, వర్గాల వారి రాజకీయ ఎదుగుదలకు లోక్‌సత్తా పార్టీ ప్రత్యేక ప్రయత్నాలు చేస్తుంది.

రాష్ట్ర అసెంబ్లీ పనితీరులో మౌలిక సంస్కరణలు

# శాసన సభ పనితీరులో మౌలిక సంస్కరణలు



# శాసన సభ పనితీరులో మౌలిక సంస్కరణలు

రాష్ట్ర అసెంబ్లీ పనితీరును ప్రజలందరూ జనమాధ్యమాల ద్వారా నిరంతరం తెలుసు కుంటున్నారు, జాగ్రత్తగా గమనిస్తున్నారు. రానురాను మన అసెంబ్లీ అపహాస్యం పాలౌతున్నది; ప్రజల తీర్పుకు విలువ లేకుండా పోతున్నది. పాత రాజకీయ సంస్కృతి, 'ఎమ్మెల్యే రాజ్యం', అధికార వేటలో రాజకీయ పక్షాలు నానాటికీ కూరుకుపోతున్నాయి. ఫలితంగా ప్రజల మౌలిక సమస్యలు మరుగున పడుతున్నాయి. ఇది మన ప్రజాస్వామ్యానికే ప్రమాద సూచిక.

అందువల్ల అసెంబ్లీ పనితీరును మౌలికంగా సంస్కరించాలి. దానిని ప్రజాసమస్యల్ని చర్చించే వేదికగా, ప్రభుత్వ పనితీరుపై సమర్థవంతమైన పర్యవేక్షణ జరిపే నిజమైన ప్రజాస్వామ్య సంస్థగా తీర్చిదిద్దడానికి లోక్‌సత్తా కట్టుబడి వుంది.

46

# చట్టబద్ధమైన స్టాండింగ్ కమిటీలు

★ **వివిధ కీలక రంగాలపై, మౌలిక అంశాలపై అసెంబ్లీ స్టాండింగ్ కమిటీలు (స్థాయీ సంఘాలు), సబ్‌కమిటీల ఏర్పాటుకు లోక్‌సత్తా ప్రభుత్వం ప్రత్యేక చట్టాన్ని గ్యారంటీ చేస్తుంది.**

★ ప్రభుత్వ విధానాలని రూపొందించటంలో వీటికి కీలకపాత్ర ఉంటుంది. శాసనసభ్యులు వివిధ అంశాలలో నైపుణ్యాన్ని, పరిజ్ఞానాన్ని పెంచుకునే అవకాశం లభిస్తుంది.

★ ప్రభుత్వంలోని వివిధ శాఖల పనితీరుపై పర్యవేక్షణ, ఆజమాయిషీ జరిపే అధికారం ఈ కమిటీలకు ఉంటుంది. కీలకమైన ప్రజాసమస్యలపై, ముసాయిదా చట్టాలపై, చట్టాల, విధానాల అమలు తీరుపై కూలంకషమైన చర్చ, నిపుణులతో సంప్రదింపులు, పబ్లిక్ హియరింగ్స్ జరిపించే అధికారం, బాధ్యతలు వుంటాయి.

★ ఈ కమిటీల సిఫార్సులను, నిర్దేశాలను, నివేదికలను ప్రభుత్వం ఖచ్చితంగా అమలు చేయవలసి వుంటుంది.

★ రాష్ట్రంలోని రాజ్యాంగ పదవులు, కీలకమైన ప్రభుత్వ పదవుల నియామకాలకు కమిటీ ఆమోదం తప్పనిసరి అవుతుంది.

★ చట్టసభ గౌరవాన్ని పెంచి ప్రభుత్వానికి సరైన మార్గాన్ని చూపెట్టటానికి కావలసిన ఏర్పాట్లన్నింటిని లోక్‌సత్తా చేస్తుంది.

# 47 అసెంబ్లీ పనితీరులో సంస్కరణలు

★ అ) శాసన సభ్యులకి నిర్దిష్టమైన ప్రవర్తన నియమావళిని ఏర్పరచి దాన్ని ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవటం

ఆ) చట్టాల తీవ్ర అతిక్రమణకు, అధికార దుర్వినియోగానికి, ప్రజాస్వామ్య విలువల ఉల్లంఘనకు పాల్పడ్డ ఎమ్మెల్యేల సభ్యత్వాన్ని తొలగించి వారిని అసెంబ్లీ నుండి బహిష్కరించడం

కోసం వ్యవస్థను లోక్‌సత్తా ప్రభుత్వం గ్యారంటీ చేస్తుంది.

★ అసెంబ్లీ సమావేశాలు, సభ్యుల ప్రసంగాలు సమయపాలనతో వుండేటట్లు స్పష్టమైన నిబంధనలు చేపడుతుంది.

★ ఎమ్మెల్యే నియోజక అభివృద్ధి నిధులు (ఎమ్మెల్యే ల్యాడ్స్) లను రద్దు చేస్తుంది. ఆ నిధులని స్థానిక ప్రభుత్వాలకి ప్రత్యక్షంగా అందిస్తుంది.

★ సభ్యులు పాలనాధికారాలను వినియోగించకుండా తగిన చర్యలను చేపడుతుంది. చట్టసభలకి, కార్యనిర్వాహక వ్యవస్థకి మధ్య స్పష్టమైన విభజనను పాటిస్తుంది. స్థానిక ప్రభుత్వాలలో, ప్రభుత్వ సంస్థల బోర్డులలో శాసనసభ్యులకు ఎటువంటి పాత్ర లేకుండా చేస్తుంది.

★ ఎమ్మెల్యేలకు పెట్రోలుబంకుల కోటాలు, గ్యాస్‌కనెక్షన్లు, టెలిఫోన్ కనెక్షన్లు, ఇళ్ళస్థలాలు వంటి ప్రత్యేక రాయితీలను పూర్తిగా రద్దు చేస్తుంది.

★ గుర్తింపు పొందిన పార్టీలకి ప్రత్యేకంగా విధానాల అధ్యయనానికి కావలసిన సిబ్బందిని, సహాయాన్ని లోక్‌సత్తా ప్రభుత్వం అందిస్తుంది.

★ శాసనసభ్యులకి సరయిన శిక్షణతో పాటు తమ విధుల నిర్వహణలో సహాయమందించే సిబ్బందిని లోక్‌సత్తా ప్రభుత్వం ఏర్పాటు చేస్తుంది.



ప్రాంతీయ అసమానతలను రూపుమాపడం

# ప్రాంతీయ అసమానతలను రూపుమాపడం





# ప్రాంతీయ అసమానతలను రూపుమాపడం

మన దేశంలో వివిధ రాష్ట్రాల మధ్య అభివృద్ధిలో అంతరాలున్నాయి. అలాగే రాష్ట్రాలలో వివిధ ప్రాంతాల మధ్య వ్యత్యాసాలున్నాయి. ఒక జిల్లాలోనే కొన్ని మండలాల మధ్య అంతరాలున్నాయి. అభివృద్ధి ఫలాలు ప్రజలందరికీ దక్కాలనే ప్రాథమిక సూత్రం దెబ్బతింటున్నది. వీటిని రూపుమాపకపోతే అభివృద్ధిలో అంతరాలు ప్రజల మధ్య అంతరాలుగా రూపాంతరం చెంది అనేక విపరిణామాలకు దారితీస్తుంది.

ఏ స్థాయికి ఆ స్థాయిలో అంతరాల తొలగింపుకు, అభివృద్ధిలో సమతుల్యం పాటించడానికి తక్షణం ఆచరణ యోగ్యమైన, నిర్దిష్టమైన చర్యలను లోక్‌సత్తా ప్రభుత్వం చేపడుతుంది.

48

# అభివృద్ధిలో అసమానతల తొలగింపు

★ రాష్ట్రంలో ప్రాంతీయ అసమానతలపై ప్రజల మనోభావాలను లోక్‌సత్తా పార్టీ పరిగణనలోకి తీసుకుంటుంది. రాజ్యాంగ పరిధికి లోబడి ఈ అసమానతల తొలగింపుకు ఈ క్రింది తక్షణ చర్యలను చేపడుతుంది.

★ **రాష్ట్రంలో వివిధ ప్రాంతాల మధ్య అభివృద్ధిలో వ్యత్యాసాలు తొలగించడానికి రాజ్యాంగంలోని 371డి అధికరణం కింద చట్టబద్ధమైన పూర్తి అధికారాలు గల ప్రాంతీయ బోర్డుల ఏర్పాటును, ప్రతిజిల్లాకి ఒక ప్రభుత్వాన్ని, నిధుల పంపిణీలో అభివృద్ధి స్థాయిని బట్టి బడ్జెట్ కేటాయింపులను గ్యారంటీ చేస్తుంది.**

★ ప్రాంతీయ అసమానతల తొలగింపుపై గతంలో చేసిన ఒప్పందాలను, చట్టాలను, జి.వోలను చిత్తశుద్ధితో అమలు చేస్తుంది. జిల్లావారీగా బడ్జెట్ కేటాయింపులను చూపెడుతుంది.

★ **రాష్ట్రంలో జల వనరుల కేటాయింపులలో వివిధ ప్రాంతాల అవసరాలు తీర్చేందుకు ప్రత్యేకంగా ఒక నిష్పాక్షిక కమీషన్‌ను లోక్‌సత్తా ప్రభుత్వం ఏర్పాటు చేసి దాని నివేదికను పూర్తిగా అమలు చేస్తుంది.**


★ వెనుకబడిన ప్రాంతాలలో వేగవంతమైన అభివృద్ధి కోసం విద్యాజోన్‌లు, వ్యవసాయ జోన్లు, పారిశ్రామిక జోన్లతో 'గ్రోత్ కారిడార్ల'ను ఏర్పాటు చేస్తుంది.

★ వ్యవసాయేతర అవసరాలకు పంట భూముల వినియోగంపై నిర్దిష్టమైన ఆంక్షలు విధిస్తుంది. రైతులు నష్టపోకుండా వారికి అంతకుమించిన సుఖజీవనానికి ఏర్పాట్లు జరిగిన తర్వాతే వ్యవసాయేతర వినియోగానికి అనుమతినిస్తుంది.

★ గిరిజన ప్రాంతాల అభివృద్ధికి సహజవనరుల వినియోగం, ఆదాయంలో వారికి తగిన భాగస్వామ్యం కల్పిస్తుంది.

అర్హులందరికీ ఓటు హక్కు

# అర్హులందరికీ ఓటు హక్కు



# అర్హులందరికీ ఓటు హక్కు

ప్రజాస్వామ్యానికి ఓటు హక్కే పునాది. ఓటుని బట్టి ప్రభుత్వాల, ప్రజల తలరాతలు మారుతుంటాయి. కాని ఓటర్ల జాబితాలలో భారీస్థాయిలో అవకతవకలు, లోపాలు పౌరుల మౌలిక రాజకీయ హక్కుని కాలరాసే, ప్రజా స్వామ్య తీర్పుని తలక్రిందులు చేసే స్థాయిలో ఉన్నాయి. లక్షల మంది అర్హుల పేర్లు ఓటర్ల జాబితాలో లేకపోవటం, అనర్హుల/బోగస్ పేర్లను ఓటర్లుగా పరిగణించటం లాంటి లోపాలు ఓట్ల కొనుగోలుకు, ఇతర ఓటింగ్ అక్రమాలకు ఆజ్యం పోస్తున్నాయి.

ఓటర్ల జాబితాలలో మౌలిక సంస్కరణల కోసం లోక్‌సత్తా ఉద్యమం దశాబ్దం నుండి పోరాడు తున్నది. ఎన్నికల సంఘం, యూనియన్ ప్రభుత్వానికి నిర్దిష్టమైన సహాయ సహకారాలను అందించి ఓటర్ల జాబితాని సమగ్రంగా ప్రక్షాళించడానికి లోక్‌సత్తా ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉంటుంది.

# 49 ఓటర్ల జాబితా ప్రక్షాళన

- **అర్హులైన రాష్ట్ర పౌరులందరూ ఓటర్లుగా నమోదయ్యేందుకు నిర్దిష్ట ఏర్పాట్లను లోక్‌సత్తా ప్రభుత్వం గ్యారంటీ చేస్తుంది.**
- ఓటర్ల జాబితాని రాష్ట్రంలోని ప్రతి పోస్టాఫీసులో సంవత్సరం పొడవునా, ప్రజలందరికి అందుబాటులో ఉండేటట్లు ఏర్పాట్లు చేస్తుంది.
- అర్హులైన వారందరినీ ఓటర్లుగా నమోదు చేయించే కార్యక్రమం స్థానికంగా, పారదర్శకంగా, సులువుగా, సంవత్సరం పొడవునా ఈ పోస్టాఫీసుల ద్వారానే జరిగేటట్లు ఏర్పాట్లు చేస్తుంది.
- అనర్హుల పేర్లను, దొంగ ఓట్లను ఏరివేయటానికి ప్రత్యేక ఏర్పాట్లను చేస్తుంది.
- కంప్యూటర్, ఇంటర్నెట్ లాంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఓటర్ల జాబితా ప్రక్షాళనను సమర్ధవంతంగా జరిపిస్తుంది.

# భూ-రికార్డులు, స్టాంప్‌డ్యూటీ



# భూ-రికార్డులు, స్టాంప్‌డ్యూటీ

రాష్ట్రంలో భూసర్వే రికార్డులు, యాజమాన్య పట్టాలు అస్తవ్యస్తంగా వున్నాయి. ఇది అనేక వివాదాలకు, భూకబ్జాలకు, తగాదాలకు కారణం అవుతున్నది. భూమి క్రయ విక్రయాలకు స్టాంప్ డ్యూటీని, భూమి విలువని హేతుబద్ధం చేయకపోవడం వల్ల అవినీతికి, నల్లధనం చేతులు మారడానికి హేతువు అవుతున్నది. ఈ అవ్యవస్థను లోక్‌సత్తా ప్రభుత్వం తొలగిస్తుంది.

50

## భూ-రికార్డులు, స్టాంప్‌డ్యూటీ

- భూమి క్రయవిక్రయాలకు స్టాంప్ డ్యూటీ గణనీయంగా తగ్గించడం
- భూమి విలువను మార్కెట్ విలువతో హేతుబద్ధం చేయడం
- భూమి కొన్న వారందరికీ విధిగా యాజమాన్య పట్టా (టైటిల్ డీడ్)లను అందించడం
- సమగ్ర భూసర్వే జరిపి భూమి రికార్డులను కంప్యూటర్ - బ్రాడ్‌బాండ్ ఇంటర్నెట్‌ల ద్వారా ప్రజలకు నిరంతరం అందుబాటులో వుంచడం

లోక్‌సత్తా ప్రభుత్వం గ్యారంటీ చేస్తుంది.

